


# ఏ రోజైనా ఆయనే కింగ్

"ప్రతి ఏడాది ఆ రోజుకు మాత్రం ఆయనే కింగ్" అంటూ సెల్‌ఫోన్‌లో స్నేహితురాలికి తన పెళ్లి రోజు గురించి గొప్పగా చెబుతోంది చందన. 'అబ్బో!' అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూనే "నా విషయంలో మాత్రం నేనే మహారాణిని" అంటూ గలగలా నవ్వుతూ చెప్పింది స్నేహ.

"ప్రతి పురుషుడి విజయం వెనుక ఓ స్త్రీ వుంటుందం టారు. మరి నువ్వు మాత్రం నీ చెప్పుచేతల్లో మీ ఆయన్ని పెట్టుకున్నావన్నమాట" అంటూ కాసేపు ఆట పట్టిం చింది స్నేహితురాలిని.

"ఆ మాత్రం గడుసుతనం వుండకపోతే మనల్ని మరింత బానిసల్ని చేసెయ్యరు? నువ్వా బాగా మెతక. ఎప్పుడూ మీ ఆయన చెప్పిందానికి తలాడిస్తావు. అప్పు డప్పుడు కాస్త బెట్టు కూడా చేయాలి. అప్పుడే మన విలు వేంటో తెలుస్తుంది" చందనలో పౌరుషాన్ని పెంచడానికి కాస్త ఆద్యం పోసింది స్నేహ.

"నువ్వు చెప్పింది కరెక్టే అనుకో! కాని సర్దుకుపోతేనే కదా సంసారం హాయిగా వుంటుంది" స్నేహ చెప్పినదా నిని సగం అంగీకరిస్తూనే తిరిగి ప్రశ్నించింది చందన.

"అంటే మీ సంసార రాజ్యానికి ఒక్కసారైనా మహా రాణిలా వుండాలని లేదా? ఎప్పుడూ వంటింటి మహా రాణిగానే మిగిలిపోతావా?" రెండోసారి కాస్తంత ఎగదో సింది. "నీ దగ్గర నిజం దాయడమెందుకు? అసలు విషయం చెప్పేస్తున్నా. ఈరోజు మాత్రం మహారాణిని కావాలనుకుంటున్నాను" మెల్లగా అసలు విషయం బయట పెట్టింది చందన.

"ఏంటేంటే... మళ్లీ చెప్పు... మళ్లీ చెప్పు" అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ "అయినా సాధుజంతువు మాంసం తింటానంటే నమ్మేస్తానేంటీ?" గడుసుగా పలి కింది స్నేహ.

"నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఇది మాత్రం నిజ మేనే. ఇన్నాళ్ల మా వైవాహిక జీవితంలో తొలిసారిగా మావారి మీద బెట్టు చేయబోతున్నాను" మరోసారి విజ యగర్వంతో స్నేహితురాలికి చెప్పింది చందన.

"వెరీగుడ్... ఆల్ ది బెస్ట్ మైడియర్ ఫ్రెండ్. ఈ పెళ్లి రోజుకి ప్రిన్సెస్ కాబోతున్నందుకు నీకు మరోసారి నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అంటూ తెగ అభినం దిస్తూనే "రిజల్ట్ కోసం రేపు ఫోన్ చేస్తానులే" అని ఫోన్ ఆఫ్ చేసింది స్నేహ.

స్నేహ ఫోన్ ఆఫ్ చేసిన దగ్గర్నుండి చందన మన సులో ఒకటే ఆలోచన. స్నేహితురాలికి గొప్పగా మాటి చ్చేశాను. ఇప్పుడు ప్రిన్సెస్ అనిపించుకోకపోతే స్నేహ ప్రతిసారి ఆట పట్టించేస్తుంది. ఎలా అని ఆలోచిస్తుండ గానే చేతిలో సెల్ మరోసారి అరవడం మొదలుపెట్టింది. స్క్రీన్‌పై చూసేసరికి శ్రీవారి ఫోటో కనిపించింది. బెట్టు చేయడానికి ఇదే మంచి సమయమనిపించి శ్రీవారి కాల్‌ని లిఫ్ట్ చేసింది.

వెంటనే "హాయ్ బంగారి... ఏంటే ఏంచేస్తున్నావ్?" అంటూ అటువైపు నుండి మాటల ప్రవాహం వినపడు తూనే వున్నా ఒక్కదానికి సమాధానం ఇవ్వకుండానే కాల్ కట్ చేసింది చందన.

మరోసారి శ్రీవారు సెల్‌ఫోన్‌లో అరచి గీపెట్టడం కనిపించింది. ఈసారి కూడా లిఫ్ట్ చేసి కాస్త మాట్లాడ నిచ్చి కట్ చేసింది చందన. కాల్ కాల్‌కి శ్రీవారి మాటల్లో మార్పు కనిపించింది చందనకు. బుజ్జి బుజ్జి పదాలతో గారంగా బ్రతిమాలడం చందనకు భలే నవ్వు తెప్పిం చింది. అయినా సరే పట్టు సడలిపోకుండా బెట్టు చేస్తూనే వచ్చింది.

* * *

చందన ఒక్కగాని నలుసుగా సీతారామ దంపతు లకు చాలాకాలం తరువాత పుట్టింది. అందుకే ఆమెను అల్లారుముద్దుగా పెంచారు. చందనకు పెళ్లి చేయాలనే ప్రస్తావనను ఎవరైనా వారిముందు తెస్తే ఆ దంపతులకు గుండె గుభేల్‌మనేది. అయినా తప్పదు. ఆడపిల్ల 'ఆడ'పిల్లే కానీ ఈడపిల్ల కాదుకదా! అనిపించేది. వారి కున్న సంపదంతా చందనకే అయినా పెద్ద పెద్ద ఫారిన్ సంబంధాలు చేయాలనే ఆశ మాత్రం ఆ దంపతులకు లేదు. కుర్రాడు మంచివాడై అమ్మాయిని భద్రంగా చూసు కుంటే చాలు అనుకుంటూ ఎల్.ఐ.సి. బ్రాంచ్ మేనేజ ర్‌గా పనిచేస్తున్న మేనల్లుడు భద్రంకు ఇచ్చి పెళ్లిచేశారు. పెళ్లికొచ్చిన బంధువులు, మిత్రులు అందరూ "భద్రం... అమ్మాయి జర భద్రం" అంటూ ఆశీర్వదిస్తూనే ఆట పట్టించారు.

చందన పెళ్లినాటికి ఇరవై ఏళ్ల పాలకుండ. అందంలో అప్సరసకు ఏమీ తీసిపోదు. అందం, ఐశ్వర్యం వున్నా ఏమాత్రం అహం లేని పిల్ల. "ఈ కాలంలో ఇన్ని మంచి లక్షణాలున్న పిల్ల దొరకడం నా అదృష్టమోయ్. అందుకే నువ్వు బంగారివి" అంటూ అసలు పేరు వదిలిపెట్టి "బంగారి" అంటూ ముద్దుగా పిలుచుకునేవాడు భద్రం.

ఎల్.ఐ.సి. బ్రాంచ్ మేనేజర్ పోస్ట్‌కి నేరుగా సెలక్ట యిన భద్రానికి కూడా పెళ్లినాటికి పాతికేళ్లే.

"ఇంత చిన్న వయసులో పెళ్లి చేసేసావేంటి సీతా రామ్" అని ఎవరైనా ప్రశ్నిస్తే "ఏ వయసులో ముచ్చట ఆ వయసులో తీరాలి. లేటు మ్యారేజ్‌ల వలన సోషల్ లైఫ్ మిస్సవుతారు. ఇప్పుడు చూడు, మా అల్లుడు అమ్మాయి దగ్గర వయస్కులు. పైగా తక్కువ వయసులో పెళ్లయింది కనుక వైవాహిక జీవితంలో మాధుర్యాన్ని చక్కగా అనుభవిస్తారు" అని సమాధానమిచ్చేవాడు.

నిజమే! సీతారామ్ దంపతులు అల్లుడు ఇంటికి వెళ్లి నప్పుడు, పండగ పబ్బాలకు వాళ్లు వీరి ఇంటికి వచ్చిన పుడు భద్రం, చందనల్లో కనిపించే జోష్ చూసి ఆ దంప తులు మురిసిపోయేవారు.


* * *

కాలింగ్ బెల్ మోగింది. వంటింటిలో మహారాణి పాత్ర పోషిస్తున్న చందన పైటకొంగుకి చేయి తుడుచు కుంటూ వచ్చి డోర్ ఓపెన్ చేసింది.

"నాన్నా..." ఒకింత ఆశ్చర్యం, ఆనందంతో ఫేస్ పెట్టి తండ్రిని పలకరించింది.

"రండి" అని ఆహ్వానిస్తుండగానే "అమ్మా" అంటూ తాతయ్య వెనుక దాగిన పిల్లలు తుర్రుమని లోపలికి పరి గెట్టారు. "ఏమిటి నాన్నా... అమ్మ ఎలా వుంది? నీకు వీళ్లెక్కడ తగిలారు?" అని వరసగా ప్రశ్నించింది. "అమ్మా చందనా... మీ అమ్మా నేనూ కులాసాగానే వున్నాం. ఇక పిల్లలంటావా? నేనే రేపు ఎల్లుండి స్కూలు ఎలాగూ సెలవే కదానని స్కూల్లో పర్మిషన్ అడిగి వెంట పెట్టుకొచ్చాను. ఇంతకీ అసలు విషయమేమిటంటే ఈరోజు మీ పెళ్లిరోజు కదా! అందుకే ఇదిగో మీ అమ్మ నీకు, అల్లుడిగారికి పంపిన కానుకలు" అంటూ తెచ్చిన బరువును చందనకు అప్పగించాడు.

"ఆc... అన్నట్టు నేను ఆల్‌రెడీ భద్రంతో మాట్లా డాను. పిల్లల్ని ఈ రెండు రోజులు నాగదగ్గరుంచుకొని



స్కూలు తెరిచే సమయానికి తీసుకొస్తాను సరేనా" అన్నాడు.

"ఇప్పుడెందుకు నాన్నా... వేసవి సెలవులకు నేనే పంపిస్తాను కదా! అయినా వాళ్లు చేసే అల్లరికి మీ ఇద్దరికి వినుగొచ్చేస్తుంది" అంటూ పిల్లల గడుగ్గాయితనాన్ని బయటపెట్టింది.

"అలా అంటావేమిటమ్మా! పిల్లలన్నాకా అల్లరి చేస్తేనే కదా ముద్దు. మరేం పర్వాలేదు" అన్న మాటలకు చందన కాదనలేకపోయింది.

తండ్రితో పిల్లలు వెళ్లేసరికి చందనకు ఎంతో పనిభారం తగ్గిపోయినట్లు అనిపించింది.

* * *

చిన్న వయసులోనే పెళ్లి కావడంతో రెండేళ్లపాటు పిల్లలు కావాలనుకునే ఆలోచన లేకుండా బాగా ఎంజాయ్ చేశారు చందన దంపతులు. తరువాత వారి అనురాగానికి ప్రతీకలుగా అబ్బాయి, అమ్మాయి పుట్టారు. అమ్మాయిని 'అమ్ములు... అమ్ములు' అంటూ ముద్దులాడుతూ భద్రం మురిసిపోతుంటే 'నాన్నా... కన్నా' అంటూ అబ్బాయికి ప్రేమనంతా పంచేది చందన.

"ఏమైనా పిల్లలు పుట్టాక నామీద శ్రద్ధ తగ్గిందోయ్" అని భద్రం అంటే "తమరికి మాత్రం నామీద భద్రం తగ్గలేదా?" అని చందన చిలిపిగా తగాదాలు ఆడుకునేవారు.

ఆ క్షణంలోనే వాటిని మరచిపోయి ఆఫీస్‌కి తయారౌతున్న భద్రంకు 'టై' కడుతూ గారంగా చూపులు పంచేది. భద్రం ఏమన్నా తక్కువా... ఇదే అదనుగా ఆమె నడుము చుట్టూ చేయి వేసి అమాంతంగా కౌగిలించుకొని పెదాలను అందుకుని చిలిపి ముద్దును తీయగా దోచేసేవాడు.

"అబ్బబ్బ! రోజురోజుకి మీలో చిలిపితనం ఎక్కువైపోతుంది" అతని బంధం నుండి విడిపించుకుంటూ చందన అంటుంటే "ఏం చేయనోయ్. నా బంగారి విలువ రోజురోజుకి పెరిగిపోతుంది. పైగా పిల్లలు పుట్టిన తరువాత నీ అందం మరింత దాహం పెంచుతోందోయ్" కొంత విరహంగా భద్రం అనేసరికి "సిగ్గులేకపోతే సరి! పట్టపగలే ఏమిటా మాటలు" అంది చందన.

"అంటే రాత్రయితే ఓకే అన్నమాట. సరే రాత్రికే వర్ణిస్తాలే" అంటూ సూట్‌కేస్ అందుకుని ఆఫీస్‌కి బయల్దేరాడు.

హౌస్ వైఫ్‌గా వుండడమే చందనకు ఇష్టం. ఎందుకంటే పిల్లలను చక్కగా ముస్తాబు చేసి స్కూలుకి పంపించి, భర్తకు కావాల్సినవన్నీ ఏర్పాటుచేసి ఆఫీస్‌కి పంపించి అక్కడినుండి వంటింటి మహారాణిలా తాను కాఫీ కలుపుకుని తాగి అలసటంతా మరిచిపోయి చక్రంలా గిర్రున తిరుగుతూ ఇల్లంతా చక్కదిద్దుకుని కాసేపు

మధ్యాహ్నం టీవీలో వచ్చే వంటల ప్రోగ్రాం చూస్తూ గడిపేది. మళ్లీ సాయంత్రం పిల్లలు వచ్చేసరికి వాళ్లకి చిరుతిళ్లు వండిపెట్టడం, భర్త వచ్చిన వెంటనే కప్పు కాఫీ అందించేది. వంటా వార్పూ చక్కబాట్లు అయ్యేసరికి రాత్రి తొమ్మిది దాటేది. అప్పటివరకు పిల్లల హోంవర్క్‌తో భద్రం కుస్తీపట్టి వాళ్లని నిద్రపుచ్చి చందన కోసం చకోర పక్షిలా ఎదురుచూస్తూ పడకపై కూర్చునేవాడు.

"ఎందుకోయ్... నీకింతటి అలసట. ఓ పనిమనిషిని పెట్టుకోవచ్చు కదా" అని భద్రం అంటే "ఇంటి పని చక్కబెట్టి ఓ ప్రక్క పిల్లలను, మిమ్మల్ని చక్కగా చూసుకోవడంలోనే ఆనందం వుంటుంది. పైగా దీనివలన ప్రత్యేకంగా మార్నింగ్ వాక్‌లు, ఎక్సర్‌సైజ్‌లు చేయవలసిన అవసరం కూడా వుండదు. అదే నా సీక్రెట్ ఆఫ్ బ్యూటీ" అంటూ కళ్లెగరేసి చందన చెప్పేసరికి భద్రం అంగీకరించక తప్పలేదు.

"ఇంతకీ ఈ అందంతో టిఫిన్లేనా? భోజనం పెట్టేదేమైనా వుందా?" అంటూ చందన చేయి పట్టి ఒక్క ఉదుటున దగ్గరికి లాక్కున్నాడు. ఆ దెబ్బకు ఆమె మరోసారి భద్రం కౌగిట్లో బందీ అయిపోయింది. "హలో సారూ... అక్కడికి అందినప్పుడల్లా ఫుల్ మీల్స్ లాగించేస్తున్నారు కదా! ఈ పూటకి పస్తులే. పక్కన పిల్లలున్నారు" హెచ్చరిస్తూనే మాటల్లో శృంగారం పాళ్లు పెంచింది.

"నా బంగారం ఊ అనాలేగానీ ఆభరణంగా మలచుకోనూ" మరింత ముందుకు దూకుతూ భద్రం పలికేసరికి "అమ్మా" అంటూ చంటోడు నిద్రలో ఏడుపు లంఖించుకోగానే భద్రం పట్టు సడలిపోయింది. చందనకు మాత్రం నవ్వాగలేదు.

* * *

కాలింగ్ బెల్ రెండుసార్లు మోగినట్లయ్యింది. ఒక్కసారి జ్ఞాపకాల్లో నుండి బయటపడి డోర్ ఓపెన్ చేసింది చందన. "ఏంటి బంగారి. ఫోన్ అన్నిసార్లు కట్ చేశావ్. నామీద అలక..." లోపలికి వస్తూనే అడిగాడు భద్రం. చేతినిండా ఏవేవో క్యారీ బ్యాగులు. ఈరోజు కాఫీ కూడా అందించలేదు చందన. అయినా సరే చాలా ఓపిగ్గా తెచ్చిన అన్ని క్యారీ బ్యాగులను ఓపెన్ చేసి బెడ్‌రూమ్‌ని డెకరేట్ చేస్తున్నాడు. చందన మాత్రం హాల్లో ఒంటరిగా అసహనంగా టీవీ చూస్తోంది. బెడ్‌రూమ్‌కి పూర్తిగా శోభన రాత్రి కళ వచ్చేసింది. మెల్లగా చందన దగ్గరకు చేరాడు భద్రం. చందన మాత్రం కనీసం భద్రం వైపు చూడడం లేదు. ఆమె దృష్టంతా అయిష్టంగానే టీవీపై వుంది. చందనను అలా చూసేసరికి భద్రం మెమరీని ఒక్కసారి వెనక్కి తిప్పి చూసుకున్నాడు.

గుర్తొచ్చింది. ఈరోజు కాస్త పని ఒత్తిడి వలన చందనపై చిర్రుబుర్రులాడిన సంగతి. అదా అలక అనుకున్న భద్రం ఇక ఆలస్యం చేయకుండా ఆమె ఎదుట హఠాత్తుగా మోకరిల్లి చేతులు జోడించి "సారీ బంగారీ సారీ" అన్నాడు.

ఎన్నడూ లేనిది ఆ స్టైల్‌లో భద్రాన్ని చూసేసరికి చందనలో సన్నని నవ్వు మొదలైంది. "హమ్మయ్య... నా బంగారంకు కోపం పోయినట్లేనా?" అని ప్రశ్నించాడు.



"ఊc..." అని సన్నగా మూలుగుతూనే "పాపం! ఇందాకట్నుండి చాలా అలసిపోయారు. కాఫీ తెస్తానుండండి" అంది.

"హలో మేడమ్ ఇది కాఫీ తాగే సమయం కాదు. పాలు పంచుకునే సమయం. మహారాణిగారు ఈ చీర కట్టుకుని మన సామ్రాజ్యంలోకి వస్తే..." అని అతడు అంటుండగానే "మరి పిల్లలో" అంది సరదాగా ఆట పట్టించడానికి.

"నాకా భయం లేదోయ్. పిల్లల్ని తీసుకెళ్లమని మామయ్యకు ఉదయాన్నే పురమాయించేసాగా" అన్నాడు. "ఊహూ... ఈ విషయంలో మీ హస్తం కూడా వుందని అప్పుడే వూహించా" అంది బదులుగా.

"శోభన పాన్పుపై ఆమె ఒడిలో తలాన్చి కబుర్లు చెబుతున్నాడు భద్రం. చందన తన వేళ్లకు వున్న చిలకలను అతని నోటికి అందిస్తూ తొలిరాత్రి సిగ్గు ఒలకబోస్తోంది. అతని నోరు ఎర్రగా పండడంతో ఆమె తలను తన దగ్గరకు వంచి తమలపాకుల ముద్దను ఆమె నోటికందించాడు. ఆ ప్రసాదాన్ని అందుకున్న ఆమె ప్రతి ఏడాదిలాగే సర్వస్వాన్ని అతనికి అంకితమిచ్చింది. ఆ హాయిలోనే ఆమె మహారాణిలా ఆజ్ఞలు వేస్తుంటే అతడు సేవకుడిలా రససామ్రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. ఆ సమయంలో అతడు ఆమె కంటికి అందాన్ని కాపు కాయడానికి చీల్చి చండాడే రాజకుమారుడిలా అనిపించాడు.

సరిగ్గా మర్నాడు స్నేహ ఫోన్ చేసింది. "ఏమిటీ... నీ పంతమే నెగ్గిందా? నువ్వు మహారాణిగా గెలిచావా?" ఆత్రుతగా అడిగింది. "సారీ స్నేహా... నేను మహారాణినైనా, ఇల్లాలినైనా ఆయన మాత్రం ఆ రోజైనా, ఏ రోజైనా నాకు కింగేనే" అంటూ ముగించింది.

## దటీజ్ లారా!

లారాదత్తా-డినో మోరియాలు ఒకప్పుడు క్లోజ్‌గా వుంటూ చెట్టాపట్టాలేసుకుని తిరిగేవాళ్లు. ఇద్దరి మధ్యా ఏం గొడవొచ్చిందోగానీ దూరమయ్యారు. ఇన్నాళ్లకి ఈ విషయమై లారా మాట్లాడిందీమధ్య. 'రెండు డేట్లు, ఓ రెండు డిన్నర్లు చేసినంత మాత్రాన 'బంధం' ఏర్పడిపోతుందా? అని ప్రశ్నించేసరికి అందరికన్నా ముఖ్యంగా డినో మోరియా ఖిన్నుడయ్యాట్ట. 'మా మధ్య ఎలాంటి అనుబంధం వుందో అంత తేలిగ్గా ఆమె ఎలా మాట్లాడగలిగిందో నాకర్థం కావడం లేదు' అంటూ ఓ టీవీ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో వాపోయాడు.